బకాయిలు వసూలయ్యేనా..

- ఆస్తి పన్ను వడ్డీపై 90శాతం రాయితీ
- ఈనెల 31వతేదీ వరకు చెల్లింపునకు అవకాశం
- వసూళ్ల కోసం నాలుగు బృందాల ఏర్పాటు



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న అధికారులు

హాలియా : మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయి దారులకు ప్రభుత్వం ఆఫర్ ప్రకటించింది. మార్చి 31వ తేదీ నాటికి పూర్తిగా చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ కానుంది. వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో హాలియా మున్సిపాలిటీలోని సుమారు 1574 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిల మొత్తాన్ని పదిశాతం వడ్డీతో ఏక కాలంలో చెల్లించి వడ్డీలో 90శాతాన్ని మాఫీ పొందే అవకాశాన్ని వన్ టైం సెటిల్‌మెంట్ కింద కల్పిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే వడ్డీ రాయితీ మొత్తాన్ని అడ్వాన్స్ రూపంలో వచ్చే ఆర్థిక సంవత్సరం పన్ను నుంచి మినహాయించి ప్రయోజనం చేకూర్చనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. దీని గురించి ప్రచారం చేయడంతో పాటు లక్ష్యాన్ని అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. రికార్డుల ప్రకారం హాలియా మున్సిపాలిటీలో మొత్తం 5640 అసెసెమెంట్స్ ఉండగా రూ. 2 కోట్ల 5లక్షలు ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ. కోటి 30లక్షలు (64.04) శాతం వసూల్ కాగా ఇంకా రూ. 74 లక్షలు 99వేలు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

లక్ష్యం..వంద శాతం

2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను హాలియా మున్సిపాలిటీలో ఆస్తిపన్ను పెద్ద ఎత్తున వసూల్ కావల్సి ఉంది. ఏటేటా పేరుకుపోతున్న బకాయిలు, మున్సిపాలిటీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ క్రమంలో మొండి బకాయిల వసూళ్లపై మున్సిపల్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం ప్రకటించిన 90శాతం వడ్డీ మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా మున్సిపల్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపనుల వసూళ్ల కోసం అధికార యంత్రాంగం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికి తిరుగుతున్నారు. 2023–24 సంవత్సరంలో బకాయి ఉన్న ఆస్తిపన్ను మొత్తంపై ఉన్న వడ్డీలో 90 శాతం మాఫీతో ఏకకాలంలో చెల్లించాలని అవకాశం ఇచ్చింది. కేవలం 10శాతం వడ్డీతో వందశాతం ఆస్తి పన్ను చెల్లించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. కమిషనర్ సైతం ఇంటింటికి వెళ్తూ..ఆస్తి పన్న వడ్డీపై 90శాతం మాఫీ గురించి వివరిస్తున్నారు. ఆస్తిపన్ను వడ్డీ రాయితీపై మెసేజ్‌లు, అవగాహన, చైతన్య సదస్సుల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. మార్చి 31 తేదీ వరకు బకయిదారు పన్ను చెల్లించి 90శాతం రాయితీ పొందాలని, అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

మరో మూడు రోజులే

ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం రాయితీ ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో చెల్లింపునకు బకాయిదారులు ముందుకు వస్తున్నారు. ఈనెల 31చివరి తేదీ కావడంతో కేవలం 10శాతం వడ్డీ కడితే సరిపోతుంది. దీంతో ఎక్కువ మొత్తంలో బకాయిలు వసూలయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సారి బకాయి వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ఈ మూడు రోజుల్లోగా వందశాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

అవగాహన కల్పిస్తున్నాం



పేరుకుపోయిన బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీ రాయితీ కల్పించింది. ఈనెల 31 వరకు అయితే 10శాతం వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ పరిధిలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఆస్తి పన్ను వసూళ్లను చేపడుతున్నాం. దుకాణాలు, ఇంటింటికి వెళ్లి ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–రామదుర్గారెడ్డి,
మున్సిపల్ కమిషనర్, హాలియా

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దఅడిశర్లపల్లి : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం గుడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే బాలికలు, మహిళలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. దేవరకొండ ప్రాంతంలో పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత, శిశు మరణాలు, బాల్యవివాహాల వంటి సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గుడిపల్లి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేశారు. గుడిపల్లి మండలానికి నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ మధుహాసిని, ఎంపీడీఓ పద్మ, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



దేవరకొండ ఆస్పత్రిలో వైద్య సేవల గురించి రోగులను అడుగుతున్న డీసీహెచ్ఎస్

దేవరకొండ : స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ మాతృనాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డు, డయాలసిస్ కేంద్రం, అవుట్ పెషెంట్, ఇన్ పేషంట్ వార్డులను పరిశీలించి అక్కడి రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో ఆక్సిజన్ కాంసన్‌ట్రేటర్స్ మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న కాన్పుల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెం డెంట్ రవిప్రకాష్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ హుండీ లెక్కింపు

నిడమనూరు : మండలంలంలోని కోటమైసమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెకల్కించారు. గత ఏడాది సెప్టెంబరు 1 నుంచి మార్చి 28 వరకు ఏడు నెలలపాటు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 12,12,995ల హుండీ ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సిరికొండ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ చెవిటి ఆంజనేయులు, విఠల్ తదితరులు ఉన్నారు.

పెద్దవూర తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

పెద్దవూర : నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరోజ దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా బదిలీ కాగా చందంపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవిన్యూ పరమైన సమస్యలను పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, కోటంగి ఆంజనేయులు, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించండి

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 31వ తేదీ వరకు 90 శాతం వడ్డీ రాయితీ కల్పించినందున బకాయిదారులు వెంటనే ఆస్తి పన్ను చెల్లించి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కల్పించిన అవకాశం మూడు రోజులు మాత్రమే ఉందని అన్నారు. ఎప్రిల్ 1నుంచి ముమ్మరంగా ఆస్తి పన్నుల వసూళ్లల్లో భాగంగా ఆస్తులు జప్తు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ జ్ఞానేశ్వరీ, ఆర్ఐలు సాంబయ్య, సాజి తదితరులున్నారు

2న ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

చింతపల్లి : మండల పరిధిలోని పోలేపల్లి రాం నగర్‌లో వన మైసమ్మ ఆలయంలో ఏప్రిల్ 2న నిర్వహించనున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవ ప్రచార కరపత్రాలను శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బాలునాయక్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దంతం సంజీవరెడ్డి, ఎరుకలి వెంకటయ్య గౌడ్, నరసింహారెడ్డి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. .

రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నిక

మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులుగా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన బంటు వెంకటేశ్వర్లు, బిల్లా కనకయ్యలు ఎన్నికయ్యారు. ఇటీవల నిజామాబాద్ లో నిర్వహించిన రైతు సంఘం మూడో రాష్ట్ర మహాసభలో తమరిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బిల్లు ఆమోదం పొందడం హర్షణీయం

మిర్యాలగూడ : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వైద్యరంగంలో మానవ అవయవ మార్పిడికి దోహదపడే అవయవ దానం బిల్లు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఆమోదించడం అభినందనీయమని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ప్రభుత్వం అవయవ దానం చేసిన వారికి ప్రభుత్వ గౌరవ లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాటు చేయాలని, అవయవ దానం, శరీర దానం చేసిన కుటుంబం పేద కుటుంబాలైతే పోత్రాహానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అదనంగా కేటాయించాలన్నారు. ఆ కుటుంబానికి ఉచిత విద్య, వైద్యం అదనంగా కేటాయించాలని, ప్రభుత్వ స్థలం కాని ఇల్లు కాని కేటాయించాలని కోరారు.

నిబంధనల ప్రకారమే అడ్మిషన్లు

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని జప్తివీరప్పగూడెం శివారులోని కేంద్రీయ విద్యాలయం బాలవికాస్‌లో ఒకటో తరగతిలో అడ్మిషన్లు నిబంధనల ప్రకారమే అడ్మిషన్లు ఇచ్చినట్లు తహసీల్దార్ హరిబాబు తెలిపారు. శుక్రవారం విద్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియను తహసీల్దార్ పరిశీలించి మా ట్లాడా రు. అయితే ఒకటో తరగతిలో ప్రవేశానికి 200 వరకు దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి అడ్మిషన్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈద్గా స్థలానికి పట్టా ఇవ్వడం హర్షణీయం

మిర్యాలగూడ : పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద ఈద్గా స్థలానికి పట్టా ఇవ్వడం హర్షణీయమని మదీనా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముఫ్తీ మహమ్మద్ ఉమర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాద్రిపాలెం మదర్సాలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో ఎన్టీఆర్ ప్రభుత్వంలో సీపీఎం ఎమ్మెల్యే నాయకత్వంలో రైల్వేస్టేషన్ వద్ద రెండు ఎకరాల 10గుంటల స్థలాన్ని ఈద్గా కోసం కేటాయించారని, అప్పటి నుంచి పట్టా కోసం 40ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. దీని కోసం కృషి చేసి ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సజ్జల రవీందర్‌రెడ్డి, చిన్నరాజు, ఇమ్రాన్‌ఖాన్, దాస్యనాయక్, రాజు, వసీం పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీలో ఫిర్యాదులు రావొద్దు



రేషన్‌షాపులకు వెళ్లే లారీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్క రేషన్ కార్డుదారుడికి సన్నబియ్యం అందజేయాలని, ఏ ఒక్కరూ తమకు బియ్యం అందలేదని ఫిర్యాదు రావొద్దని తహసీల్దార్ హరిబాబు అన్నారు. శుక్రవారం సన్న బియ్యం గోదాంల నుంచి రేషన్ షాపులకు సన్న బియ్యం తరలిస్తున్న లారీలను పరిశీలించారు. అనంతరం మండలంలోని రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 200 రేషన్‌షాపులు ఉన్నాయని, ఇప్పటికే 88 షాపులకు బియ్యం పంపించినట్లు తెలిపారు. శనివారం వరకు పూర్తి స్థాయిలో రేషన్‌షాపులకు బియ్యం చేరుతాయన్నారు. అదే విధంగా రేషన్ డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా కార్డుదారులకు పూర్తి స్థాయిలో సన్న బియ్యం అందే విధంగా చూడాలన్నారు. కార్డు హోల్డర్లు మాకు బియ్యం అందలేనితనకు ఎలాంటి ఫిర్యాదు రావొద్దని, ఫిర్యాదు వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ డీలర్లు తప్పని సరిగా సమయపాలనను పాటించి బియ్యం సక్రమంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జావీద్, ఆర్ఐలు ఠాగూర్ రామకృష్ణ, భాణావత్ సత్యనారాయణ తదితరులున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



వేములపల్లి : నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

వేములపల్లి : కేంద్ర ప్రభుత్వం గతంలో రైతు సంఘాలకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వాయి రాంరెడ్డి అన్నారు. పంజాబ్ పోలీసులు రైతుల అణచివేతకు నిరసనగా ఆలిండియా కిసాన్ మోర్చా పిలుపుమేరకు శుక్రవారం మండల కేంద్రంలో రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, జిల్లా నాయకులు రొండి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు చల్లబొట్ల ప్రణీత్ రెడ్డి, రెమడాల భిక్షం, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెంటమల్ల సుకన్య, జడ నారాయణ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిపారసులు అమలు చేయాలి

మాడుగులపల్లి : కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిపారసులను అమలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సంఘం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోని స్వామినాథన్ కమిషన్ సిపారసులను అమలు చేసి వెంటనే రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు దేవిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, వెంకటాచారి, శైలేంద్ర, పద్మ, సరస్వతి, రమాదేవి, కన్నయ్య, సీతారాంరెడ్డి, భిక్షం, లక్ష్మయ్య, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఏప్రిల్ మాసంలో నిర్వహించే మహనీయుల జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని పలు దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో మహాత్మాజ్యోతిరావ్ పూలే బీసీ భవనంలో దళిత సంఘాల ఐక్య వేదిక సమావేశం ఆ సంఘం నేత వస్కూల మట్టయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రావ్ జయంతి, 11న మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి, 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సమావేశం అనంతరం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు తాళ్లపల్లి రవి, మచ్చ ఏడుకొండలు, తలకొప్పుల సైదులు, బొప్పాని నగేష్, నాగభూషణం, పుట్ట దినేష్, వజ్జగిరి అంజయ్య, ముదుపు శ్రీను పాల్గొన్నారు.

బావుల నడుమ రహదారి



పాల్తీతండాలో రహదారికి ఇరువైపులా ఉన్న బావులు

పెద్దవూర : మండలంలోని పాల్తీతండా రహదారిపై ఉన్న బావులు ప్రమాదకరంగా మారాయి. ఒకే ప్రదేశంలో బీటీ రహదారికి ఇరువైపులా పెద్ద వ్యవసాయ బావులు ఉన్నాయి. బావులు ఉన్న ప్రదేశంలో రెండు వైపులా ప్రమాదకరమైన మూలమలుపులు ఉండటంతో దగ్గరికి వచ్చేదాకా బావులు ఉన్న విషయము తెలియదు. వాహనం నడిపే డ్రైవరు ఏమాత్రం ఏమరుపాటు ప్రదర్శించినా నేరుగా బావులలో పడిపోయే ప్రమాదం ఉంది. అదీగాక రహదారి బీటీ అంచుల దాకా రైతులు భూములను సాగుచేశారు. తంగెళ్లతండా నుంచి పాల్తీతండా వరకు రెండు కిలోమీటర్ల మేర ఏదైనా వాహనం ఎదురుగా వస్తే వెనుకకు వెళ్లాల్సిందే. అధికారులు స్పందించి బావుల వద్ద రక్షణగోడలు ఏర్పాటుచే ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

మత సామరస్యం, ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్



మిర్యాలగూడ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఖర్జూర తినిపిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



ముస్లింకు ఖర్జూర తినిపిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



దేవరకొండ : రంజాన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



హాలియా : ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

హాలియా : మతసామరస్యం, ఆత్మీయతకు ఇఫ్తార్ విందు ప్రతీకగా నిలుస్తుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హాలియా పట్టణంలోని లక్ష్మి నరసింహ గార్డెన్స్‌లో సాగర్ నియోజకవర్గ ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, తహసీల్దార్ రఘు, కృష్ణయ్య, అనిల్, కమిషనర్ రామదుర్గారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ గవాన్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని చిన్న మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న షాదీఖానా భవనం నిర్మాణానికి కృషి చేస్తామని, శ్మశానవాటికకు నిధులు కేటాయిస్తామని, స్లాటర్‌హౌస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలన్నారు. అలాగే పట్టణంలోని మసీద్‌ఏ అరాఫత్‌లో పదేళ్లుగా సఫాయి కర్మచారిగా పనులు చేస్తున్న లక్ష్మణ్‌ను చిన్న మసీదు కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్, తహసీల్దార్ హరిబాబు, కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, నాయకులు మిట్టపల్లి వెంకటేష్, మైబల్లి, చిరుమర్రి కృష్ణయ్య, రామలింగయ్యయాదవ్, పొదిల శ్రీనివాస్, ఎండి.జాని, మోయిజ్, జావిద్, ఇమ్రాజ్, వలిఉల్లా, హఫిజోద్దిన్ పాషా, రహీం, బాబా తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ జరుపుకోవాలి

దేవరకొండ : రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ఈద్గా, మక్కా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఏ సిరాజ్ ఖాన్, వేణుధర్‌రెడ్డి, రహత్‌అలీ, పున్న వెంకటేశ్వర్లు, సయ్యద్ అజీమొద్దీన్, ఇలియాస్‌పటేల్, ఖదీర్, సాబేర్, బాబా, బురానొద్దీన్, ఖాజా ఉన్నారు.

త్రిపురారంలో రంజాన్ తోఫా పంపిణీ

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆరీఫా బేగం ఆర్థిక సహకారంతో రంజాన్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను మండల కాంగ్రెస్ నాయకులు, కార్యాలయ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొమ్మిది రకాల వస్తువులు ముస్లిం సోదరులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, ఎంపీఓ సుదీర్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, పంచాయతీ కార్యదర్శి డిరెక్క రాజేంద్ర కుమార్, త్రిపురారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మట్టయ్య, కాంగ్రెస్ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆలంపల్లి జానయ్య, వీరయ్య, జయక్రిష్ణ పాల్గొన్నారు.

బంజారా సేవా సంఘం నాయకుల హర్షం



ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డిని సన్మానిస్తున్న బంజారా సేవా సంఘం నేతలు

హాలియా : తెలంగాణ అసెంబ్లీలో బంజారుల (గోర్ బోలి) భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు సాగర్ నియోజక వర్గ ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హాలియా పట్టణంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డిని బంజారా వేషధారణ రుమాల్‌తో ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలోని బంజారులంతా కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంగోతు భగవాన్ నాయక్, సాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ బాస్కర్‌నాయక్, కోశాధికారి సక్రు నాయక్, అనుముల మండల అధ్యక్షుడు పాండు నాయక్, నాగేంద్రనాయక్, సర్దార్ నాయక్, ప్రసాద్ నాయక్, ముని నాయక్, అనిల్ ఉన్నారు.

చలివేంద్ర ప్రారంభం

పట్టణంలో సుప్రియ బోర్ వెల్స్ అండ్ ఎర్త్ మూవర్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రానిన శుక్రవారం సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు

గుర్రంపోడు : క్రీడా పోటీలతో యువకుల్లో స్నేహభావం పెరుగుతుందని మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని శ్రీదేవీ భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి 8వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రికెట్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 26జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు షేక్ మౌలానా, వెలుగు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ రావు, షేక్ సయ్యద్‌మియా, జాలచిన సత్తయ్య యాదవ్, వెల్గ పూరి రాంబాబు రావు, పగిళ్ల లాలయ్య, కిరణ్, చాడ చక్రవర్తి, రాంబాబు, గ్రోమోర్ మేనేజర్ సైదులు గౌడ్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన

చింతపల్లి : వక్ఫ్ సవరణ బిల్లు 2024కు వ్యతిరేకంగా శుక్రవారం ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) పిలుపు మేరకు మండల కేంద్రంలోని ముస్లింలు ఉపవాస దీక్ష విరమణ సమయంలో చేతికి నల్లటి బ్యాండ్లు ధరించి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ..వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల మసీదులు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలు, ఖాన్లాలు, స్మశానవాటికలు, ధార్మిక సంస్థలను లాక్కునేందుకు ఉద్దేశించిన కపటకుట్రగా పేర్కొంది. ఈ కార్యక్రమం లో సయ్యద్ రౌఫ్ హుస్సేన్, సలీం, రియాజ్, ముంతాజ్, ఖలేద్, యాసీన్ బాబా, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి : ఆర్థిక సమస్యలు తాళలేక పురుగుల మందు సేవవించి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మంత్రియాతండాకు చెందిన రమావత్ రాజు(40) వారం రోజుల క్రితం ఆర్థిక సమస్యలతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.